

7న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 7న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కెవిఎల్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డిడియుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల జీతం, ఇన్‌సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 7వ తేదీ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరవ్వాలన్నారు.

సంక్షేమ నిధులేవి జగనన్నా..?


- భవన కార్మికుల నిధుల మళ్లింపు
- పెండింగ్‌లో క్లెయిములు
- పోరాటంలో నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కేంద్రంతో పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోంది. రూ.వేల కోట్ల సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికులకు అన్యాయం చేస్తోంది. ఈ నిధులను తిరిగి జమచేయాలని కార్మికులు చేస్తోన్న డిమాండ్‌ను పట్టించుకోకపోగా, సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ 2021 సెప్టెంబర్‌లో మెమో 1214ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిములను పరిష్కరించాలని కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భవన, ఇతర నిర్మాణ రంగాలపై ఆధారపడి 53 రకాల పనులు చేస్తున్న కార్మికులు సుమారు ఐదు లక్షల మంది ఉన్నారు.

పరిష్కారం కాని క్లెయిములు

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చి కార్మికుల పొట్టగొట్టారు. లక్షల మంది జీవనోపాధిని దెబ్బతీశారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తూ వచ్చారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఏకంగా రూ.2,450 కోట్లు మళ్లించారు. అప్పటి నుంచి కార్మికుల క్లెయిములు పరిష్కారానికి నోచుకోలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019 నుంచి 196 మంది సహజ మరణం పొందగా వీరికి రూ.76.80 లక్షలు, ప్రమాదాల్లో మరణించిన ఎనిమిది మందికి రూ.37.20 లక్షలు, అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందిన 46 మందికి రూ.4 లక్షలు, 1,868 మంది ప్రసూతి పరిహారాలకు రూ.3.73 కోట్లు, 229 మంది అంత్యక్రియల ఖర్చులు రూ.45 లక్షలు, 105 మందికి పెళ్లి కానుకగా రూ.18 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందిన ముగ్గురికి రూ.7.50 లక్షలు మొత్తంగా 2,454 మందికి రూ.5.62 కోట్ల పరిహారాలు పెండింగ్‌లో ఉన్నాయి.



మంత్రి దాడిశెట్టి రాజాకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు (ఫైల్)

దశల వారీ పోరాటాల్లో కార్మికులు

దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికులు దశల వారీ పోరాటాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ ఏడాది జులై ఒకటిన ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల ఒకటిన అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే మరో రెండు వారాల్లో మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని కార్మికులు తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టి చలో విజయవాడకు పిలుపునిస్తామని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.



పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలి

పెండింగ్ క్లెయిములు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్లెయిములను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. సంక్షేమ నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించడం సిగ్గుచేటు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తాం.

- రొంగలి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘం, కాకినాడ జిల్లా



పరిహారం అందలేదు

నా భర్త బుర్రి వీరవెంకట సత్యనారాయణ 2019లో బిల్డింగ్ పని చేస్తుండగా జరిగిన ప్రమాదంలో చనిపోయారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. నా ఇద్దరు కుమారులతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. సంక్షేమ బోర్డు ఇంతవరకూ నుంచి ఎలాంటి పరిహారమూ అందలేదు. అధికారులను అడుగుతుంటే అదిగో ఇదిగో అంటున్నారు.

- బుర్రి నాగతులసి, నరేంద్రపట్నం, జగ్గంపేట మండలం

ఆగస్టు నెలాఖరున సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



పనులపై సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

సామర్లకోట లేఅవుట్‌లో సామూహిక గహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ నెలాఖరులో జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, హౌసింగ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ జి.లక్ష్మీశతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, జెసి ఎస్.ఇలక్కియ జి.రాగంపేట రోడ్డులోని ఇటిసి సమీపంలో జగనన్న కాలనీ లేవుట్‌ను సందర్శించారు. పట్టాపొంది ప్రభుత్వ సహకారంతో ఇంటిని నిర్మించుకుని నివసిస్తున్న బొబ్బర పద్మ గృహాన్ని సందర్శించారు. అనంతరం లేవుట్ సమీపంలోని జూనియర్ కళాశాలలోని సిఎం సభా వేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. పెద్దాపురం మండలం, జి.రాగంపేట రోడ్‌లోని హెలిప్యాడ్ స్థలాన్ని ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో అజయ్ జైన్, లక్ష్మీశ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు గృహ నిర్మాణం, రెవెన్యూ, మునిసిపల్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, మెప్మా తదితర శాఖల అధికారులతో చర్చించారు. లేఅవుట్‌లో మొత్తం మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లు, రహదారులు, డ్రెయిన్లు, విద్యుత్, తాగునీరు, ఓపెన్ ప్లేస్‌లో హరిత విస్తీర్ణం పెంపు, స్వాగత ద్వారం, పైలాన్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ జి.వీరేశ్వర ప్రసాద్, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, హౌసింగు డిఇ రాజు, మెప్మా పీడీ బి.ప్రియంవద, డ్వామా పీడి అడపా వెంకటలక్ష్మి, కాకికాడ డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణకృష్ణమూర్తి, వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన చేరువ

ప్రజాశక్తి-కాజులూరు

గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం తదితర వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశారని రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. శుక్రవారం శీల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలెవరూ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలోనూ విద్య, ఆరోగ్యం, వ్యవసాయం ఇలా వివిధ శాఖలకు సంబంధించి పది మంది సిబ్బంది ఉన్నట్లు వివరించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఈ సచివాలయాల సిబ్బంది మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు (విఎఎ) ప్రతిదశలోనూ రైతులకు అండగా ఉంటున్నారన్నారు. గత వరదల సమయంలో పంట నష్టపోయిన సందర్భంలో వివరాలు సేకరించి, సత్వరం రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందడంలో వీరు కీలక పాత్ర పోషించారని వివరించారు. సమాజంలో పేదరికాన్ని తొలగించడానికి వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు గౌరవ ముఖ్యమంత్రి నేతత్వంలో అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుబ్బారావు, ఎంపిపి భారతి మురళి, ఎంపిడిఒ రత్నరాజ్, వ్యవసాయ అధికారి అశోక్, ఎంపిటిసి కృష్ణమూర్తి, సర్పంచ్ కోమలి వెంకటరమణ, గుబ్బల యేసు రాజు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, పెద్దిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

కాకినాడలో బేబీ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చిన్న సినిమాగా రిలీజై సంచలనం సష్టించిన బేబీ సినిమా యూనిట్ శుక్రవారం కాకినాడలో సందడి చేసింది. హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య, వీరాజ్ అశ్విన్, సినీ దర్శకుడు సాయిరాజేష్ కాకినాడ పద్మప్రియ థియేటర్‌లో ప్రేక్షకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హీరో హీరోయిన్లు మాట్లాడుతూ సినిమాపై చూపించిన అభిమానం మరువలేదని, చిన్న సినిమాను ఇంత విజయం సాధించిందంటే ప్రేక్షకులే కారణం అన్నారు.



థియేటర్‌లో చిత్ర బృందం

ఆదిత్య డిగ్రీ కళాశాలకు నాక్-ఎ ప్లస్ గుర్తింపు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్)ఎ ప్లస్ గుర్తింపు కల్పించినట్లు ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలోనే మొట్టమొదటిగా (నాక్) ఎప్లస్ గుర్తింపు పొందిన ఏకైక అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఆదిత్య డిగ్రీ కళాశాల అని చెప్పారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ సుగుణరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు మిగతా కళాశాలలకు ఒక స్ఫూర్తిదాయకమన్నారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ డిగ్రీ అన్‌ఎయిడెడ్ కళాశాలల చరిత్రలోనే ఇదొక మైలురాయి అన్నారు. విద్యా ప్రమాణాలను పాటించడంలో ఆదిత్య విద్యా సంస్థలు ఎప్పుడూ ముందుంటాయన్నారు. డైరెక్టర్ నాయుడుకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన వసతులు కల్పించడంలోనూ, టెక్నాలజీకి అనుగుణమైన కోర్సులు నిర్వహించడం, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలోనూ ఇలా అన్ని విధాలుగా విద్యా ప్రమాణాలు పాటించడమే ఈ అద్భుత విజయానికి కారణమన్నారు. సిబ్బంది పాత్ర ఎంతో ఉందని ప్రత్యేకంగా అభినందించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు, సతీష్ రెడ్డి, కృష్ణ దీపక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎన్.మూర్తి, డి.బ్యూలా, రమేష్ పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రిలయన్స్ సిఎస్ఆర్ ప్రతినిధి బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానిక రిలయన్స్ ఆసుపత్రిలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. రిలయన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్యామ్, డాక్టర్ రేవంత్, డాక్టర్ ఈశ్వర్ బందం జనరల్ మెడిసిన్ చర్మవ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు ఈ శిబిరానికి చేరుకొని పరీక్షలు మందులు తీసుకున్నారు. ఏటా రిలయన్స్ ఆధ్వర్యంలో మూడు రకాల వైద్య శిబిరాలు నిర్వహిస్తామని సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపిటిసి వనమాడి వేణి, వైద్యులు శివప్రసాద్, పల్లెసిరి మురళీధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇటిసిలో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు మూడు రోజులపాటు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సూచనల మేరకు విస్తరణ శిక్షణ కేంద్రం, జి.రాగంపేట రోడ్డులోని జగనన్న కాలనీ ప్రజలు, పట్టణ ప్రజలు వారి సమస్యలు, పిర్యాదులు, అవసరాలపై ఈ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. హెల్ప్ డెస్క్ అధికారులుగా పి.జానకి బాబు, బి.అప్పారావును ఏర్పాటు చేసినందున వారిని 9866016053, 9347060295 నంబర్లలో ప్రజలు సంప్రదించాలని తెలిపారు.

టిడిపి మినీ మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ వైసిపి పాలనలో మహిళల ఆర్థికపరిస్థితి అధోగతిగా మారిందని మాజీ మేయర్, టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సుంకర పావని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి మినీ మేనిఫెస్టో మహిళా శక్తితో భవిష్యత్తు గ్యారెంటీ పథకాల ప్రచారంలో భాగంగా కాకినాడ 34వ డివిజన్ బ్యాంకు పేటలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. వినూత్నంగా సిలిండర్ల నమూనాలు ప్రదర్శించారు. **తాళ్లరేవు** పిల్లంకలో సాగి బాబ్జిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడారు. **జగ్గంపేట రూరల్** జె.కొత్తూరులో బద్ది సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, కంచుమర్తి రాఘవ, దాపర్తి సీతారామయ్య, సర్వసిద్ధి లక్ష్మణరావు, సుంకవిల్లి రాజు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** 11, 12 వార్డుల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, పైణ్ణి శ్రీనివాసరావు, సానిపిని వెంకటరావు, కాళ్ల రవీంద్ర, కురుకూరి సోమేశ్వరరావు, నిమ్మకాయల కిరణ్, గొర్రెల జయలక్ష్మి, గుడాల శంకర్ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** గంగనాపల్లిలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి ప్రచారం చేశారు. మట్టా ప్రకాష్ గౌడ్, సరదే నాగ హరినాథ్, ఎలగా లోవరాజు, పండూరి జయకృష్ణ, పంపన బుజ్జి, బజ్జ భవాని, సాంబశివరావు, దొమ్మేటి వెంకటరమణ, పడమటి వీరబాబు, దేవతా చల్మాజీ, నీల రాంబాబు, గంజా రాంబాబు, ఇళ్ల శ్రీను, పట్టెం వెంకటేష్, పెండెం శ్యామ్ గణేష్, కొమిరిశెట్టి నర్సింగరావు, టేకుమూడి శ్రీను, పిల్లి శ్రీధర్, పెమ్మాడి శ్రీను పాల్గొన్నారు.




కరపత్రాలను పంచుతున్న సుంకర పావని

కొత్తపల్లిలో గడప గడపకూ వైసిపి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మండల కేంద్రమైన కొత్తపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం ఎంఎల్ఎ పెండెం దొరబాబు పాల్గొన్నారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కర్రపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి ప్రజలు తీసుకురావడంతో త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపల్లిలో ఆయన సొంత గ్రామంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు గైరజరయ్యారు. ఎంఎల్ఎతో విబేధాలతోనే ఆయన కార్యక్రమానికి దూరంగా ఉన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకుడు రావు చిన్నారావు, కొత్తపల్లి సర్పంచ్ గవర భవాని నాగేశ్వరరావు, గింజల శ్రీనివాసరావు, సర్పంచులు బండి రాణి దావీదు, నక్కా మణికంఠ, ఉమ్మడి మేరీ జాన్, పాలని దొరబాబు, కర్రి చిన్నారావు, సాన నాగు, మారిశెట్టి బుజ్జి, ఆనాల సుదర్శన పాల్గొన్నారు.




కరపత్రాలను పంచుతున్న ఎంఎల్ఎ దొరబాబు

రొయ్యల కంపెనీలపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో ఉన్న రొయ్యల కంపెనీలు రూ.కోట్లాది ఆదాయం ఆర్జిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని రొయ్యల కంపెనీలు వదులుతున్న వ్యర్థ జలాలు వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. తాళ్లరేవు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపిటిసిలు పాలెపు చినపోసియ్య, పోతుల రత్నకుమారి, రచ్చ ముత్యాలు మాట్లాడారు. కోరంగి పంచాయతీలోని సుమారు 30 కంపెనీలు వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా ఆత్రేయపాయలోకి వదులుతున్నారని, దీనివల్ల ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారిందన్నారు. కోరంగి పంచాయతీ సీతారాంపురం, ప్రతాప్ నగర్ గుడ్డివాని తూము సెంటర్‌కు చెందిన మురుగు కాలువ దుర్గంధంగా మారిందన్నారు. దీనిపై ఎంపిపి రాయుడు సునీత మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన రొయ్యల కంపెనీలపై మూడు రోజుల్లో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించడానికి కృషి చేయాలని ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తిని ఆదేశించారు. డెంగ్యూ వ్యాధిపై పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు గృహాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని హెచ్ఎస్ ఇబ్రహీం అన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ.10 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 లక్షలు జరిమానా విధిస్తారని ఐసిడిఎస్ విస్తరణ అధికారి లలిత తెలిపారు. ఎంపిటిసిలు దంగేటి సూరిబాబు, గుత్తుల శ్రీనివాస్, తహశీల్దారు పోతురాజు, ఎంఇఒ మంగాయమ్మ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మారుతీరావు, ఎఒ ప్రశాంతి పాల్గొన్నారు.

కార్టూన్'నిజం'



గర్భిణులు, బాలింతలకు కిట్ల పంపిణీ

గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పలుచోట్ల పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో అంగన్వాడీ సెంటర్‌లో అంగన్వాడీ టీచర్ సిహెచ్.విజయ ఆధ్వర్యాన మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ కిట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ సూర్యావతి, కింతాడ సత్యనారాయణ, తెలగాపు ఈశ్వరావు, వేపాడ శ్రీను, కాకిరాజు, కనకాల లోవకుమార్, సూరాడ సత్తిబాబు, గరికిన మణి వేమన, అవనిగడ్డ వెంకట రమణ, ఎన్ఎం రాధ, జిఎంఎస్ కె.దుర్గా నీరజ పాల్గొన్నారు. **గండేపల్లి** ఎంపిఇ చలగళ్ల దొరబాబు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగ పార్వతి ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. ఎంపిడిఒఒ బిఎస్‌కె.రామన్, ఇందిరా ప్రియదర్శిని, జిఎస్ఇ.రాణి, వి.కృష్ణవేణి పాల్గొన్నారు. **రౌతులపూడి**లో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జి.రమణమ్మ, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి పంపిణీ చేశారు. వైసిపి మండలాధ్యక్షుడు శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, సిడిపిఒ పద్మావతి పాల్గొన్నారు. **పెద్దాపురం** పాత పెద్దాపురంలో కౌన్సిలర్ ఆరేళ్ల వీర రాఘవ కిట్లు పంపిణీ చేశారు. సీతామహాలక్ష్మి, సూపర్వైజర్ వెంకటలక్ష్మి, తులసి, స్నేహలత, జయ,కపామణి పాల్గొన్నారు. వడ్లమూరులో వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవరావు కిట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కళ, చల్లా రామాంజనేయులు, ఉండమట్ల గంగాధర్, లోవరాజు, ఎలుబండి శ్రీను, దొరబ్బాయి, సతీష్, అంగన్వాడీ టీచర్లు సుజాత, సీతారత్నం, నూర్జహాన్, నాగకుమారి పాల్గొన్నారు. **కరప** వేళంగిలో సర్పంచ్ సర్పంచ్ సవిలే నీలిమారాజేష్ పంపిణీ చేశారు. సవిలే రాజేష్, పాలిక సూరిబాబు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** వైసిపి సేవాదళ్ మండల అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు రమణయ్యపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిట్లు పంపిణీ చేశారు. నల్లి వెంకటరమణ, కేబుల్ బాబు, ముద్రగడ నాయుడు, రత్నరాజు పాల్గొన్నారు.



గండేపల్లిలో పోషకాహార కిట్ల పంపిణీ

రెండో రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం పంచాయతీ పరిధిలో భూ ఆక్రమణలు తొలగించాలని స్థానికులు చేస్తున్న దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, టిడిపి నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు.

9న క్విట్ కార్పొరేట్ నిరసన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆగస్టు 9న క్విట్ ఇండియా జాతీయోద్యమాన్ని పురస్కరించుకుని క్విట్ కార్పొరేట్ నినాదంతో బాలా చెరువు సెంటర్ వద్ద నుంచి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని ఎఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షుడు అంజిబాబు తెలిపారు. కాకినాడ అచ్యుతాపురం గేటు వద్ద పైళ్ళమ్మ తల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం, పారిశుధ్య కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఎపి రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాయుడు గోవిందు, తిరుమలశెట్టి వెంకటరమణ, పి.ప్రభాకర్, గంధం రాజబాబు, వి.రాజబాబు, సహాయ కార్యదర్శి కడితి సతీష్, దేశెట్టి సురేష్ పాల్గొన్నారు.



జగ్గంపేటలో టిడిపి నేతల ఆందోళన

చంద్రబాబుపై దాడికి టిడిపి నిరసనలు

చిత్తూరులో చంద్రబాబు యాత్రను అడ్డుకుని దాడికి దిగడం పట్ల టిడిపి శ్రేణులు శుక్రవారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటనందూరు తుని, నర్సీపట్నం రోడ్డులో టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య, పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు నిరసన తెలిపారు. పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, వంగలపూడి బుజ్జి, గాది వరహాలుబాబు, చింతంనీడి అబ్బాయి పాల్గొన్నారు. **ఏలేశ్వరం** సి.రాయవరం రహదారిపై టిడిపి శ్రేణులు బైఠాయించారు. నియోజకవర్గ ఇన్చార్జి పరుపుల సత్యప్రభ మాట్లాడారు. జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, బస ప్రసాద్, మూదీ నారాయణస్వామి, పలివెల శ్రీనివాస్, ప్రజలు ఉన్నారు. **సామర్లకోట రూరల్** నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీష్ మోహన్, పైణ్ణి శ్రీనివాసరావు, సానిపిని వెంకటరావు, కాళ్ల రవీంద్ర, కురుకూరి సోమేశ్వరరావు, నిమ్మకాయల కిరణ్, గొర్రెల జయలక్ష్మి పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** జె.కొత్తూరులో జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన చేపట్టారు. ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, బద్ది సురేష్ సైనం శ్రీను పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్ పైకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి-రాజానగరం

జాతీయ రహదారి గైట్ కళాశాల సమీపంలో ఎపిఎస్ఆర్‌టిసి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న నాన్ స్టాఫ్ బస్సు ముందు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో అది డివైడర్ పైకెక్కింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉన్నారని, వారందరూ కాకినాడ చేరారని డిపో మేనేజరు ఎస్‌కె.సబాన్డ్ చెప్పారు.

కారు బైకు ఢీకొని తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -గోకవరం

కారు బైకు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గోకవరంలో చోటు చేసుకుంది. గోకవరం పోలీసులు కథనం ప్రకారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామానికి చెందిన కర్రి సాంబమూర్తి రాజమహేంద్రవరంలో తాపీ పని చేసుకుని తిరుగు ఇంటికి బైకుపై వస్తుండగా గోకవరం మండలం వీరలంకపల్లి వద్ద గోకవరం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు బైకును ఢీకొట్టడంతో సాంబమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి వైద్య సహాయం నిమిత్తం గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తపేట

ఆటో బోల్తా కొట్టడంతో ఒక వ్యక్తికి గాయాలైనట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన వీరవల్లి రామారావు శుక్రవారం కొత్తపేటలో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు వచ్చారు. ఉదయం తిరిగి తన స్వగ్రామానికి వెళ్లేందుకు కొత్తపేటలో ప్యాసింజర్ ఆటో ఎక్కాడు. మార్గం మధ్యలో ఏనుగు మహల్ వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న రామారావుకు బలమైన గాయాలు తగలడంతో వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు తుని సిఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు. పోలీసులకు ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం తుని ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర పోలీసులు వలపని పట్టుకున్నారు. 22 కేజీల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రూ.పది వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా పాత నేరస్తులుగా గుర్తించారు. ఈ దాడుల్లో తుని పట్టణ ఎస్ఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

జాతీయ రహదారిపై మంత్రి కాన్వాయ్ వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నీలాద్రిరావు పేటలో మంత్రి దాడిశెట్టి రాజా కాన్వాయ్ వెళుతుండగా ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -కరప


నడకుదురులోని బృందావనం కాలనీలో జరిగిన దోపిడీ కేసును పోలీసులు చేధించారు. శుక్రవారం కరప పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. నడకుదురు గ్రామంలో ఒక మహిళపై దాడి చేసి నాలుగు గాజులు, రెండు చెవి దుద్దులు, బంగారు ఆభరణాలు దొంగలించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. వారిలో ఇద్దరు మైనర్లని, వారి వద్ద నుంచి రూ.లక్ష విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకుందామన్నారు. ఐ.పోలవరం మండలం కొత్త మురమళ్లకు చెందిన విత్తనాల సంతోష్ వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు అలవాటు చేసుకున్నాడని చెప్పారు. మరో ఇద్దరు బాలురను ప్రోత్సహించి తనతో పాటు తీసుకెళ్లి నేరాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు సూరిబాబు, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

'జెట్టి' నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి అమలాపురం

మత్స్యకారుల జీవనోపాధిపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే మిగిలిన జెట్టి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ పెచ్చెట్టి బాబు అల్లవరం మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు, ఓడలరేవు గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లు విష్ణుమూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ జెట్టి పనులను వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఐదేళ్ల క్రితం టిడిపి హయాంలో ఓడలరేవు చేపల రేవు వద్ద గోదావరిలో జెట్టి నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. 90 శాతం పనులను పూర్తి చేస్తే మిగిలిన 10 శాతం పనులను వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసింద మండిపడ్డారు. మిగిలిన జెట్టి పనులు పూర్తయి సౌకర్యంగా ఉంటే ఎందరో మత్స్యకారులకు జీవన ఉపాధి దొరుకుతుందని ఆయన అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం నిలిచిపోయిన జెట్టి పనులను పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతా శ్రీనివాస్, ఆకుల లక్ష్మణరావు, పోతుల నాగరాజు, కాండ్రేగుల వీర వెంకట సత్యనారాయణ, ముత్యాల బాబి, మంతెన సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాలు, రెయిన్ కోట్స్ పంపిణీ



రిక్షాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రూరల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అన్నారు. స్థానిక తూరంగి పంచాయతీలో కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో 10 చెత్త సేకరణ రిక్షాలను కురసాల సత్యనారాయణ కార్మికులకు అందించారు. అనంతరం మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ ఇటీవల 63 మంది కార్మికులకు రూ.వెయ్యి చొప్పున రూ.63 వేల నగదును, 63 రెయిన్ కోట్లు అందించిన వైసిపి నాయకుడు అనిశెట్టి రామకృష్ణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడలి సాయి, దాట్ల సరబాబు, పంపన రామకృష్ణ, రొంగల వెంకటేశ్వరరావు, గొల్లపల్లి బాబులు, దుగ్గన దొరబాబు, సిద్ధాంతి రాజు, నరాల నాగేశ్వరరావు, కర్రి చక్రధర్, పెదపూడి సతీష్ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి



పాడైన చేలను పరిశీలిస్తున్న వల్లు రాజబాబు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. మండలంలో వరదల కారణంగా మునిగిన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రాజబాబుతో మాట్లాడారు. సుంకరపాలెం చింతాకుల వారి పేట మధ్యలో ఉన్న మురుగు కాలువ బాగు చేసి పైన ఉన్న వందల ఎకరాలు సాగయ్యే విధంగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. ఇప్పటికే రెండు నెలల సాగు ఆలస్యమైందని ఇంజరం, గోవలంక, అరటికాయలంక, చింతాకుల వారి పేట మధ్యలో ఉన్న 100 ఎకరాలు భూమి గోదావరి ఎగబెట్టడం వల్ల, అరటికాయలంక వద్ద స్లూయిజ్ గేట్లు ఎత్తకపోవడం వల్ల వరద నీరు నిల్వ ఉండే పంట పొలాలు మునిగిపోతున్నాయన్నారు. మురుగునీరు దిగే కాలువ పూడికతో, గుర్రపు డెక్కతో మూసుకుపోయిందని వెంటనే మురుగు కాలవ బాగు చేయాలని కోరారు.

ఫార్మా విద్యార్థుల ఐబిఎస్‌సి సందర్శన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఇండియన్ బయోమెడికల్ స్కిల్ కౌన్సిల్ (ఐబిఎస్‌సి) ఎపి మెడ్ టెక్ జోన్ లిమిటెడ్ (ఎఎంటిజెడ్) విశాఖపట్నం కార్యాలయాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. ఈ ఫార్మా పారిశ్రామిక సందర్శన ద్వారా ప్రత్యక్ష అవగాహన పొందడానికి దోహద పడుతుందన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఎఎంటిజెడ్ అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్, పిరమిడ్, ఆంఫినల్ సెన్సార్లు, ఇన్నోవేటివ్ ల్యాబ్, గామా ఫెసిలిటీ, థింక్ త్రీ డి, మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ వంటి విభాగాలు సందర్శించినట్టు డాక్టర్ రవిశంకర్ తెలిపారు. పరిశ్రమలో వివిధ విభాగాలు అవి పని చేసే విధానం తెలుసుకున్నామని విద్యార్థులు సంతప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయ సిబ్బంది డాక్టర్ కె.రామకృష్ణ, బి.రాజు పాల్గొన్నారు. సుమారు 90 మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువుల్లో వ్యాధి నిరోధకత



ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పుట్టిన పసిపిల్లల నుంచి ఏడాది వరకు తప్పనిసరిగా తల్లిపాలు పడితే ఆ పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కాకినాడ జిజిహెచ్ తల్లి పిల్ల బొమ్మ వద్ద నుండి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తల్లిపాలలోని పోషక విలువలను గురించి తల్లులకు వివరించారు. తల్లిపాలు పెట్టకుండా డబ్బా పాలు పడుతున్న పలువురికి డబ్బా పాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. తల్లిపాలు పట్టని పసిపిల్లలకు అనారోగ్యానికి మాటిమాటికీ గురవుతూ ఉంటారని తెలిపారు. తల్లిపాలకు దూరం చేస్తే పసిపిల్లలు పూర్తిగా నీరసంగా ఉండే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, రోడ్లిక్ కప్ చైర్మన్ కాశీ విశ్వేశ్వరరావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

బాలింతలు తల్లిపాల విశిష్టతను తెలుసుకోవాలని, బిడ్డలకు ఆరోగ్యాన్నిచ్చేలా వైద్యుల సలహాలు పాటించాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ అన్నారు. మండలంలో పలుగ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్, ఫ్రైడే డ్రై డే, వైఎస్ఆర్ కంటి వెలుగు, తల్లిపాల వారోత్సవం, విలేజ్ హెల్త్ న్యూట్రిషనల్ డేలను నిర్వహించారు. డాక్టర్ ఉషాదేవి తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. దమ్మెన్నులో బాలింతలకు, గర్భిణులకు సర్పంచ్ పోషకాహార కిట్లను అందించారు. కాల్దారిలో నిర్వహించిన వైఎస్ఆర్ కంటి వెలుగులో 60 మందికి కంటి వైద్య నిపుణులు టి.రాంబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ డి.అనూష, ఎంపిహెచ్ఎ, టి.మహాలక్ష్మి, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

పోచవరంలో ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు ఓటు హక్కుపై ఎఎస్ఐ జోడాల వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఓటు విలువను వివరించారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండుతున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఓటు ఉందో లేదో తెలుసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు మేట్ వీరలక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వెలం పాలెం గ్రామంలో శుక్రవారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను మంత్రి దష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్ల సమస్య గురుంచి విద్యుత్తు లైట్లు పై మంత్రి దష్టికి తీసుకు వచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబాటి భవాని, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత, జెడ్‌పిటిసి సభ్యుడు మెర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ లు యల్లమెల్లి సతీష్ కుమారి, కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

కామనగరువులో 'ఫ్యామిలీ డాక్టర్ '

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు సచివాలయం 2లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ లో భాగంగా శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ నక్కా అరుణకుమారి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజలపూడి భాస్కరరావు, ఎంపిటిసి సభ్యులు మెండు గంగా భవాని, సచివాలయ కార్యదర్శి సూరిబాబు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లి లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన రోడ్లు కు శుక్రవారం సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ అధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి తదితరులు భూమిపూజ చేశారు. అలాగే రూ.1.8 కోట్ల తో నిర్మించిన నూతన తారు రోడ్డు ను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి కట్టా సత్తిబాబు, సెంట్రల్ డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, ఎంపిటిసి సభ్యుడు సత్తి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఛార్జింగ్ ఎల్ఇడి లైట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

బొబ్బర్లంక గ్రామ పరిధిలో పిచ్చుకలంకలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఎంపిడిఒ నాతి బుజ్జి ఆమె పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఛార్జింగ్ ఎల్ఇడి లైట్లు అందజేశారు. అలాగే గ్రామంలో ఉన్న శ్రీరామ వద్ధాశ్రమములో ఉన్న వద్దులతో ఆమె కలిసి కేక్ కట్ చేసి, వారికి బ్రెడ్లు, పండ్లు, శాలువాలు, ఛార్జింగ్ లైట్లుఅందజేశారు.

భాస్కరమూర్తికి డాక్టరేట్

ప్రజాశక్తి - రాజానగరం

భీమవరం బివి.రాజు కళాశాల ఎంసిఎ విభాగాధిపతి వి.భాస్కరమూర్తికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి లభించింది. ఆదికవి నన్నయ యూనివర్సిటీ విసి కె.పద్మరాజు చేతుల మీదుగా యూనివర్సిటీలో ఆయన పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. 'కేన్సర్ డేటా, కేన్సర్ ప్రమాద కారకాలను అధ్యయనం చేయడానికి కంప్యూటేషనల్ ఎనాలసిస్ యొక్క ఉపయోగం'అనే సిద్ధాంత వ్యాసానికి ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా భాస్కర్‌మూర్తికి రిజిస్ట్రార్ టి.అశోక్, బివి.రాజు కళాశాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పులతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పనిచేసే ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అంటువ్యాధులకు సంబంధించిన మందులతో బాటు అన్నిరకాల, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కాట్రేనికోన

భారత ప్రభుత్వ సంస్థ సిపెట్ విజయవాడ వారు ఎంఎస్ఎంఇ, ఎన్ఎస్ఐసి భారత ప్రభుత్వం వారి సంయుక్త సౌజన్యంతో 30 మంది ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈశిక్షణను 6 నెలల పాటు ఇచ్చి, అనంతరం వారికి సర్టిఫికెట్ తో పాటు ప్లాస్టిక్స్ మరియు అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని జాయింట్ డైరెక్టర్, హెడ్ డాక్టర్ సిహెచ్.శేఖర్ శుక్రవారం ఒక తెలిపారు. వివరాలకు 7893586494 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ముమ్మిడివరం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం మురముళ్ల టిడిపి కార్యాలయంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా రెడ్డి అనంత కుమారి,రెడ్డి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. చెల్లి వివేకానంద, మోకా ఆనంద సాగర్ మాట్లాడుతూ టిడిపిని బలోపేతం ప్రతి సమన్వయ కమిటీ సభ్యులు కృషి చేయాలని అన్నారు.



సదస్సులో పాల్గొన్న కమిషనర్

ఇండోర్ సదస్సులో కమిషనర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

దేశంలోని వివిధ నగరపాలక సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవలసిన పాలనా సంస్కరణలు, అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఇండోర్‌లో అర్బన్ శానిటేషన్ అండ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ నిర్వహించారు. ఇండోర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో గత నెల 31 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ, తిరుపతి, కర్నూల్, నెల్లూరు, కడపతోపాటు కాకినాడ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ హిమాన్సురాయ్, స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రాతోపాటు అనేకమంది ప్రతినిధులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యుత్తమ పాలనా సంస్కరణలు ద్వారా దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన ఇండోర్ వంటి నగరాల్లో అమలు జరుగుతున్న పరిపాలనా విధానాన్ని సదస్సులో వివరించారు.

వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లాలో సార్వా వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిందని స్థానిక ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.నరసింహారావు, డాక్టర్ ఎఎస్ఆర్.శర్మ, ఎస్.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తెగులు నారుమడిదశ నుండి నాట్లు వేసిన నెల రోజుల వరకు పంటను ఆశిస్తుందన్నారు. ఆకుల అంచుల నుండి లోపలి వైపుకు మచ్చల మాదిరిగా పసుపు రంగుకు మారుతాయన్నారు. తెగులు ఉధతంగా ఉంటే దుబ్బు మొత్తం ఎండిపోతుందన్నారు. ఈ తెగులు ఉంటే నత్రజని ఎరువులను తాత్కాలికగా నిలిపివేయాలన్నారు. పొలంలో నుండి నీటిని రెండు మూడు సార్లు బయటికి పంపించి కొత్త నీటిని పెట్టాలన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కాండ్రకోటలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూముల సారవంత పరీక్ష ఫలితాలు రైతులకు వివరించారు. ఈ పరీక్షలను బట్టి పంట పొలాలకు ఎరువులు వినియోగించాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో రైతులకు ఫ్రీ బ్యాలెట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బి.నాగ స్రవంతి, ఎం.సత్తిబాబు,రైతులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది తెలుగుదేశం పార్టీ అని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమడి కొండబాబు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కోనాడ ప్రకాష్ రావు ఆధ్వర్యాన పలువురు భారీగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివద్ధి, కాకినాడ నగర అభివద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకులు నాగిడి నాగేశ్వరరావు, మల్లాడి చిన్నా, గంగిరి నాగేశ్వరరావు, గరికన చిట్టిబాబు, కరుకు సింహాద్రి, కుందు కోటేశ్వరరావు, వాడమొదల రాజారావు, కారే రాంబాబు, కోనాడ రాము, కోనాడ అప్పారావు, వజ్రపు నారాయణ, వాసంశెట్టి అప్పారావు, కరకు పెద్ద సింహాద్రి, కరకు మణి, కారే సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్లో డిజిటల్ క్లాస్ రూమ్

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోటలోని జెడ్‌పి హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను శుక్రవారం పెద్దాపురం జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లో ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం వల్ల పేద కుటుంబాల పిల్లలు కూడా విద్యాభివద్ధి సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం మూర్తి, విద్యా కమిటీ చైర్మన్ వాడరేవు వీరబాబు, పళ్ల గంగారావు, గవరసాన బాబ్జి, ఉపాధ్యాయుడు ఎం.వెంకటరమణ, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఘనంగా సిఎం రంగసామి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి 74వ పుట్టినరోజు వేడుకలు యానాంలో మల్లాడి కృష్ణారావు స్వగృహంలో మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం స్థానిక అంబేద్కర్ సర్కిల్ పాత బస్టాండ్ వద్ద ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మల్లాడి శామ్యూల్ ఆధ్వర్యంలో సిఎం రంగసామి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అనంతరం యానాం ఓల్డేజ్ హోమ్‌లో ఉన్న వృద్ధులు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, సిబ్బందికి ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెండెం సూర్య ప్రకాష్, గిడ్ల చంద్రరావు, గూటం శివ గణేష్, శేరు కృష్ణ, మల్లాడి అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఇఎస్ఐ బిల్లులు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - యానాం

యానాం ఇఎస్ఐ హాస్పిటల్ పరిధిలో వైద్యం చేయించుకుని ఇఎస్ఐ ద్వారా పెట్టుకున్న వారికి రెండేళ్ల నుంచి బిల్లులు ఇవ్వడం సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు దుర్గాప్రసాద్ ఇఎస్ఐ హాస్పిటల్‌ను శుక్రవారం సందర్శించారు. అక్కడ పనిచేసే యుడిసి ఉద్యోగి రాంబాబును వివరణ కోరగా తమకు వచ్చిన బిల్లులను తక్షణమే పుదుచ్చేరి డిడి ఆఫీస్‌కు పంపిస్తున్నట్లు తెలిపారన్నారు. ఇఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో కేవలం రూ.30 వేల మాత్రమే మంజూరు అవుతాయని, అంతకంటే ఎక్కువ బిల్లులను లేబర్ డిపార్ట్మెంట్ మంజూరు చేయాలని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేసేలా పైస్థాయి అధికారులతో మాట్లాడతానని రాంబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఇఎస్ఐ హాస్పటల్‌లో స్టాఫ్ నర్స్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతునట్లు తెలిపారు. ఆ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఇప్పటివరకు వచ్చిన బిల్లులను మంజూరుచేయాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 24న యుడిసి ఉద్యోగోన్నతి పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగాల ఉన్నతికోసం సెప్టెంబరు 24న పరీక్ష నిర్వహించనున్నట్లు అండర్ సెక్రటరీ వి.జైశంకర్ ప్రకటన విడుదల చేశారు. పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను వెబ్‌సైట్ నుంచి తీసుకోవాలన్నారు. మే 9 నుంచి సిలబస్ అందుబాటులో ఉందన్నారు. త్వరలో హాల్ టికెట్లు పంపిస్తామని పేర్కొన్నారు.

రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో సిఎం పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

రీజెన్సీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జిఎన్.నాయుడు సూచనల మేరకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి 74వ జన్మదిన వేడుకలు ఏజెన్సీ పబ్లిక్ స్కూల్లో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం టివిఎస్‌వి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రంగస్వామిని గౌరవించడమే కాక విద్య, సమాజానికి ఆయన చేసిన కషికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన చేసిన సేవలు విద్యార్థులకు వివరించారు. 1200 మంది విద్యార్థులకు స్వీట్స్ పంచారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకొని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

సిఎం రంగసామిని కలిసిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి 74వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా రంగస్వామిని కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ సిఎం రంగస్వామికి పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విద్యార్థులు ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు దూరంఆ ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి సూచించారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'ర్యాగింగ్ నివారణ', 'మాదకద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు, మాదక ద్రవ్యాల నిషేధం చట్టం-2015పై ధవళేశ్వరంలోని వివేకానంద ఐటిఐ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడారు. తోటి విద్యార్థులను అవమానకరంగా, బాధించే విధంగా చేసే ఎలాంటి పనైనా ర్యాగింగ్‌గా భావిస్తారన్నారు. ర్యాగింగ్ నిషేధంలో కళాశాల యాజమాన్యాలు పాటించాల్సిన నియమాల గురించి ఆమె తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997 గురించి వివరించారు. ఎన్‌డిపిఎస్ యాక్ట్-1985 గురించి అవగాహన కల్పించారు. సదస్సులో ట్రైనీ న్యాయ మూర్తులు రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి కె.శ్రీనివాసులు, ధవళేశ్వరం సిఐ కె.మంగాదేవి, కళాశాల ప్రిన్సిపల్ కె.సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం, సీతానగరం గ్రామం కాపురస్తురాలైన పోలపర్తి నాగదేవి, భర్త: మోహన్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **U2703544** గల ఒరిజినల్ పాస్‌పోర్టు 25-07-2023 తేదీన స్వగ్రామం సీతానగరం నుండి రాజమండ్రి బస్సులో ప్రయాణం చేస్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది నంబరకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

పోలపర్తి నాగదేవి
భర్త: మోహన్, రామాలయం వీధి,
సీతానగరం, సీతానగరం మండలం,
తూ॥గో॥ జిల్లా, సెల్: 89197 88521

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No.1339/2023 in I.P.No.39/2021

బిట్వీన్:

పిటీషనరు /పిటీషనరు:

కాసాని సురేష్ కుమార్

రెస్పాండెంట్స్ /రెస్పాండెంట్స్:

పర్వతాల వెంకట సుబ్బారావు & వగైరా

3వ రెస్పాండెంటు అడ్రెసు:

Parvathala Durga Prasad, S/o. Narasimha Rao, Signal Operator, R/o. S.S.Apartment, 2nd Floor, Float No. 202, Beside Royal Apartment, East Railway Station Back Gate, Rajahmundry, E.G.Dist.,

పై నెంబరు పిటీషనులో 3వ రెస్పాండెంటుకి కోర్టు ద్వారా, పోస్టు ద్వారా నోటీసులు ఎన్ని పర్యాయములు పంపించినప్పటికీ ఉద్దేశపూర్వకంగా తీసుకొనక Avoid చేయుచున్నారు. సదరు 3వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది.14-08-2023 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల 3వ రెస్పాండెంటు పరోక్షముగా ఈ పిటీషను తీర్మానించబడును.

బి.లోకేశ్వరరావు, అడ్వకేట్,
భీమవరం-1. సెల్: 99599 06907

మహారాజశ్రీ 4వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

O.S.No. 641/2022

Between:

The karur Vysya bank Ltd., Bommuru Branch, Rep. by its Branch Manager, Bommuru, Rajamahendravaram Rural mandal RJCJ. ***...Plaintiff***

AND

Grandhi SPVSN Murthy and Others ***...Defendants***

Defendants 1 & 2:

D-1: Grandhi SPVSN Murthy, S/o. Rama Mohana Rao, Hindu, Aged 35 Years, Business, Flat No. 312, B Block, MK Signature Apartment, Gandhipuram-3, Rajahmundry-533105.

D-2: Leelavathi Narasimha, W/o. Narasimha Gopala Krishna, Hindu, Aged 50 Years, Business, D.No. 32-7-18, Meraka Street, Town Hall Road, Rajahmundry.

పై నెంబరు దావాలో 1,2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.22-08-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.వి.కె.రమేష్
డి.వాణి రమేష్
అడ్వకేట్స్, రాజమండ్రి.
రాజమండ్రి,
28-7-23.